క్లుప్తంగా

బైక్‌ను ఢీకొన్న కారు



గాయపడిన వారిని రిమ్స్‌కు తరలిస్తున్న దృశ్యం

మేదరమెట్ల: కొరిశపాడు మండల పరిధిలోని తిమ్మనపాలెం జాతీయరహదారిపై ఒంగోలు వైపు వెళుతున్న బైక్‌ను ఎదురుగా వచ్చిన కారు ఢీ కొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న వారికి గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం జరిగింది. ధర్మవరానికి చెందిన జాషువా మరో ఇద్దరు చిన్నారులను బైక్‌పై ఎక్కించుకొని ఒంగోలు వైపు వెళుతున్నాడు. బైక్ తిమ్మనపాలెం సమీపానికి రాగానే గుర్తు తెలియని కారు ఎదురుగా వచ్చి బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో జాషువా కుడికాలుకు తీవ్రగాయం కాగా చిన్నారులకు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న హైవే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వృత్తి విద్యా కోర్సులు పూర్తి

జె.పంగులూరు: చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10 వ తరగతి విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమగ్ర శిక్షణ వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసినట్లు పాఠశాల హెచ్ఎం చందలూరు గిరిజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో భాగంగా ఎలక్ట్రానిక్స్ ట్రేడ్స్‌కు సంబంధించి ట్రైనర్ టి. లక్ష్మి తిరుపతమ్మ చందలూరులోని రాము ఎలక్ట్రానిక్ షాపులో సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 1 వరకు 10 రోజుల పాటు ఇంటర్ షిప్‌ను విద్యార్థులతో పూర్తి చేయించామన్నారు. ఇంటర్ షిప్‌కు అవకాశం కల్పించిన చిలుకూరి రామకృష్ణ సహకరించిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోండి



టీచర్లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

చీరాల అర్బన్: మెగా డీఎస్సీ–2025లో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఈఓ డి.గంగాధర్ అన్నారు. మెగా డీఎస్సీ–2025 లో ఎంపికైన ఉపాధ్యాయులకు శుక్రవారం నుంచి శిక్షణ తరగతులను ప్రారంభించారు. చీరాల్లో వీఆర్ఎస్‌వైఆర్ఎన్ కాలేజీలో మ్యాథ్స్, సోషల్, ఫిజికల్ సైన్సు సబ్జెక్టులపై 178 మందికి, రామాపురంలోని చీరాల ఇంజినీరింగ్ కాలేజీలో తెలుగు, హిందీ, ఇంగ్లిషు సబ్జెక్టులకు సంబంధించి 189 మందికి శిక్షణ తరగతులకు హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ డీఈఓ డి.గంగాధర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శిక్షణా కార్యక్రమానికి హాజరై తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోర్సు డైరెక్టర్ బి.పురుషోత్తం మాట్లాడుతూ శిక్షణ తరగతులను ఈనెల 10వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ప్రోగ్రాం ఇన్‌చార్జి జి.శ్రీనివాసరావు, రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

సాగు భారం.. బతుకు ఛిద్రం

- పంటల సాగుకు భారీగా పెరిగిన పెట్టుబడులు
- ఎరువులు, విత్తనాలు, కూలీల ధరలతో లబోదిబో
- రైతులను ఆదుకోని ప్రభుత్వం



పొలం దున్నుతున్న రైతు

వేటపాలెం: గత ఏడాది అనావృష్టి, అతివృష్టతో రైతులు ఖాళీ చేతులతో మిగిలారు. వాతావరణం సహకరించకపోయినా.. కొందరు ఖరీఫ్, రబీ సీజన్‌లో పంటలు పండించినా కూటమి ప్రభుత్వం రూపంలో కష్టాలు ఎదురయ్యాయి. ఏ పంటకూ సరైన గిట్టుబాటు ధర లేక అప్పులపాలయ్యారు. అన్నదాత సుఖీభవ, పంట ఇన్‌పుట్ సబ్సిడీ, యంత్రాలు అందక వ్యవసాయం కుదేలైంది. అధికారంలోకి వచ్చిన వెంటనే వ్యవసాయానికి పెద్దపీట వేస్తామని గొప్పలు చెప్పిన కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి సాకులు చెబుతున్నారు. దీంతో వ్యవసాయం అంటేనే రైతులు భయపడుతున్నారు. ఏటేటా పెరుగుతున్న పెట్టు బడులతో పంటల సాగుకు తడిసిమోపెడవుతోంది. పంటలు పండక గిట్టుబాటు ధరలకు భరోసా కరువైంది. ప్రభుత్వం సబ్సిడీలు ఇస్తున్నా అవి పలుకుబడి గల రైతులకే అందుతున్నాయి.

ప్రోత్సాహం కరువు..

ప్రభుత్వం నుంచి మద్దతు ధర కరువవడంతో రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మార్కెట్‌లో విత్తనాలు, ఎరువుల ధరలు పెరడంతో ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో రైతులు కొమ్మమూరు కెనాల్ పరిధిలో ప్రస్తుతం అత్యధికంగా వరి పంట సాగు చేస్తుండగా, మెట్ట రైతులు మిరప, జొన్న, వేరుశనగ, పత్తి, శనగ పంటలు సాగు చేస్తున్నారు. జిల్లా ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో వివిధ పంటలు సాగు చేశారు. మరి కొన్ని ప్రాంతాల్లో వరి నాట్లు వేస్తున్నారు. అయితే విపరీతంగా పెరిగిన కూలీల ఖర్చులు, ఎరువుల ధరలతో గతేడాది కంటే ఈ సారి సాగు పెట్టుబడి అధికమైంది. కేవలం ఎరువుల ధరలు అధికంగా పెంచుతూ పంటలకు మాత్రం అంతంత మాత్రంగా గిట్టుబాటు ధరలు నిర్ణయిస్తుండటం పై కర్షకులు పెదవి విరుస్తున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో ..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో క్షేత్ర స్థాయిలో రైతులకు సేవలు అందించేందుకు విత్తనం మొదలుకొని దిగుబడి విక్రయం వరకు అన్ని సమయాల్లో సర్కారు అండగా నిలిచింది. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామ సచివాలయాలకు అనుసంధానంగా రైతు భరోసా కేంద్రాలను అనుసంధానంగా రైతు భరోసా కేంద్రాలను నిర్మించారు. వీటి ద్వారా గ్రామస్థాయిలోనే రైతులకు విత్తనాలతోపాటు వ్యవసాయానికి సంబంధించిన అన్ని సేవలతోపాటు రైతు భరోసా నిధులను రైతు ఖాతాలకే జమ చేశారు. నియోజకవర్గానిక ఒక ల్యాంబ్‌ని ఏర్పాటు చేశారు.

ధరలు ఇలా..		
	గతేడాది (రూ)	ప్రస్తుతం (రూ)
ట్రాక్టర్ వేసవి దుక్కి దున్నుడు	600	700
ట్రాక్టర్ వరి సాగు దమ్ము	700	800
వరి నాట్లు వేసినందుకు ఎకరాకు	3600	4200
విత్తనాలు కొనుగోలు (25కిలోలు)	1000	1100
కలుపు కూలీ	300	350
ఎరువులు ఎకరాకి	2850	3800
వరి మిషన్.. కోత మిషన్‌కి	2300	2500

పెట్టుబడులు పెట్టలేకపోతున్నాం:

గడిచిన రెండేళ్లగా వ్యవసాయం నష్టాలను మిగిల్చింది. కోటి ఆశలతో పంటను సాగుచేయాలంటే పెట్టుబడి పెట్టలేక పోతున్నాం. విత్తనాలు, ఎరువుల ధరలు పెరగడం, కూలీల రేట్లు పెరగడంతో సాగు భారమైంది. రైతులను ఆదుకుంటామని గొప్పలు చెప్పడమే కానీ రైతులకు ప్రభుత్వాలు సాయం చేయడం మరిచాయి. దీంతో వ్యవసాయం రోజు రోజుకు గుదిబండగా మారుతోంది.

– కోటి రెడ్డి, దేశాయిపేట

వ్యవసాయానికి దూరం

నష్టాల్లో ఉన్న వ్యవసాయాన్ని కాపాడకపోతే రాబోవు కాలంలో సాగుకు రైతులు దూరమవుతారు. ఇప్పటికి 70 శాతం రైతులు తమ సొంత పొలాలు వదిలేసి, కౌలుకు ఇస్తున్నారు. ఇదే పరిస్థితి కొన సాగితే కౌలుకు సాగు చేసే వారు కూడా దూరమవుతారు. దీంతో పంటలు పండించే నాథుడు కరువుతారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు రైతులను గుర్తించి వారికి చేయూతనందించాలి.

– వెంకటేశ్వర్లు

జీఎస్టీ తగ్గింపుతో దిగివచ్చిన ధరలు

చినగంజాం: ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో నిత్యావసర వస్తువుల ధరలు తగ్గి పేదలకు అందుబాటులోకి వచ్చాయని ఎంపీడీఓ కె. ధనలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని గొనసపూడి గ్రామంలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వం ఇస్తున్న జీఎస్టీని ఏ విధంగా ఉపయోగించుకోవాలి ఎంత వరకు తగ్గింపు వస్తుందనే విషయమై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీఓ ఆధ్వర్యంలో ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఉన్న రైతులు, ప్రజలు తమ నిత్యావసర వస్తువులు ధరలు ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు ద్వారా తగ్గించిందో ప్రజలకు వివరించారు. ముఖ్యంగా వస్తువులకు జీఎస్టీ లేకుండా చేయటం అనేది చాలా సంతోషకరమని అన్నారు. మిగిలిన వస్తువులకు కేవలం 5 శాతం నుంచి 18 శాతం వరకు ఉంటుందని తెలిపారు. ఏపీఎం సుబ్బారావు మాట్లాడుతూ గతంలో వస్తువులు రేటు ప్రస్తుతం వస్తువుల రేటు తేడాను గమనించి కొనుగోలు చేయాల్సిందిగా తెలియజేశారు. కార్యక్రమంలో పురుగు మందుల డీలర్లు, మండల సమాఖ్య అధ్యక్షురాలు శారద, వీఓఏ రమ్య, పంచాయతీ కార్యదర్శి, రైతులు పాల్గొన్నారు.



పర్చూరు: సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ వెంకటస్వామి



గొనసపూడి గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీఓ ఇతర అధికారులు

పర్చూరు(చినగంజాం): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగ్గించిన జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పి. వెంకటస్వామి తెలిపారు. శుక్రవారం పర్చూరు పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ సభలో మాట్లాడుతూ వస్తువులపై జీఎస్టీ తగ్గించడం వలన ప్రజల కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ కె. సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ మల్లా అంజమ్మ,వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అభయాంజనేయ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న దృశ్యం

బల్లికురవ: దసరాశరన్నవరాత్రులు వేడుకల్లో భాగంగా గురువారం మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలోని సాయిబాబా ఆలయ సమీపంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టకు భూమిపూజ చేపట్టారు. కార్తీక్, కోటేశ్వరరావు బృందంచే జరిగిన వేడుకల్లో గ్రామంలోని మహిళంతా పాల్గొన్నారు.

దళితులపై దాడులు ఖండించాలి

చీరాల రూరల్: అంటరానితనం, కుల వివక్ష, దళితులపై దాడులు, లైంగిక దాడులను ఖండించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ 28వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లింగం జయరాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్. బాబురావు, ఎం. వసంతరావులు మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీల అత్యాచార నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని ప్రభుత్వాలను కోరారు. దళితులకు సరిపడా శ్మశానవాటికలు ఏర్పాటు చేయాలని, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను సక్రమంగా ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి. ఇమ్మానుయేలు, బి. సుబ్బారావు, వై. ప్రసాద్, జి. సుధాకర్, కుర్రా రామారావు, బి. పిచ్చయ్య, కె. గోపాల్, శీలం రవి, తదితరులు పాల్గొన్నారు.



కేవీపీఎస్ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



వేటపాలెంలో కన్యకా పరమేశ్వరి



కారంచేడులో రాజరాజేశ్వరిదేవిగా



కారంచేడు శివాలయంలో అలంకరణ



చీరాల:అలంకరణలో అద్దంకమ్మ

ఘనంగా విజయదశమి

చీరాల అర్బన్: విజయదశమి సందర్భంగా గురువారం రాత్రి దేవాలయాల్లో పార్వేట ఉత్సవాన్ని నిర్వహించారు. పట్టణంలోని ఎన్ఆర్‌పీఎం హైస్కూల్, పేరాలలోని ఏఆర్ఎం హైస్కూల్‌లో పార్వేట ఉత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పాల్గొని పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అన్ని దేవాలయాల దేవతామూర్తులను ఒకే చోట కొలువుతీరడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు.

వేటపాలెం: స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో గల శ్రీరాజ్యలక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో విజయదశమి పండగను పురస్కరించుకొని స్వామి వారి కల్యాణ మహోత్సవం గురువారం వేదపండితులు కన్నుల పండువగా నిర్వహించారు. 26 మంది దంపతులు కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలికించారు.

కారంచేడు: దేవీ నవరాత్రులు (దసరా పండుగ)ను పురస్కరించుకొని అమ్మవారిని భక్తులు ప్రత్యేక అలంకరణలతో అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తొమ్మిది రోజులు పాటు తొమ్మిది అవతారాలతో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. మండల కేంద్రమైన కారంచేడు వైష్ణవీ దుర్గాలయం, పెదబజారు శివాలయం, సాయిమందిరం, కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం, వెంకటేశ్వరస్వామి ఆలయం, మాధవస్వామి గుడి, మండలంలోని స్వర్ణ వెంకటేశ్వరస్వామిగుడి, కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం, శివాలయంలతో పాటు, కుంకలమర్రు, దగ్గుబాడు, కొడవలివారిపాలెం గ్రామాల్లోను అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

యద్దనపూడి: విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలో గురువారం సాయత్రం శమీ దర్శన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో చివరిరోజు అమ్మవారు శ్రీరాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

మేదరమెట్ల: దసరా పండుగను మండలంలోని ప్రజలు భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. మేదరమెట్ల కొండవద్ద ఉన్న పోలేరమ్మ తల్లి వద్ద స్వాములు పాల్గొని పలు కార్యక్రమాలను నిర్వహించారు. రావినూతల సాయిబాబా దేవస్థానం వద్ద మహిళలు కోలాటం కార్యక్రమాన్ని నిర్వహించారు.

చీరాల టౌన్: మండలంలోని పాతచీరాల గ్రామంలో కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరుగాంచిన అద్దంకమ్మ తల్లి 15వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని ప్రత్యేక పూలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.



రావినూతల సాయిబాబా మందిరంలో దుర్గాదేవి అలంకారంలో చిన్నారి



చీరాల టౌన్: కుంకుమ పూజలో భక్తులు



వేటపాలెంలో శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం



చీరాల: గోమాతలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య



పూనూరులో శమీ వృక్ష పూజ చేస్తున్న అర్చకులు

ఎయిడ్స్ నిర్మూలన సామాజిక బాధ్యత

మేదరమెట్ల: ఎయిడ్స్‌ను.. మాదకద్రవ్యాల నిర్మూలను అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో ఉండాలని ఎయిడ్స్‌పై పూర్తి అవగాహన తప్పనిసరి అని మేదరమెట్ల టీఐ ప్రోగ్రాం మేనేజర్ దుర్గా సురేంద్ర పేర్కొన్నారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో హెల్ప్, ఎయిడ్స్ నిర్మూలనా సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై, అలాగే మదకద్రవ్యాలపై అవగాహనా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్‌లో కరపత్రాలను ఆవిష్కరించి బస్టాండ్‌లో అందరికీ పంచిపెట్టారు. ఉపసర్పంచ్ మన్నె దుర్గారావు, హెల్ప్ సంస్థ ప్రతినిధులు, మల్లీశ్వరి, దుర్గా భవాని, కృష్ణవేణి, ఏఎస్ఎం రాధమ్మ పాల్గొన్నారు.



మేదరమెట్ల బస్టాండ్‌లో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బైక్‌ను ఢీకొన్న కారు

చీరాల అర్బన్: బైక్‌ను కారు ఢీకొట్టడంతో యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం చీరాల మండలం వాడరేవు జాతీయ రహదారిపై వాకావారిపాలెం వద్ద శుక్రవారం జరిగింది. చీరాల మండలం వాడరేవుకు చెందిన టి.బాలాజీరెడ్డి బైక్‌పై వెళుతుండగా కారు ప్రమాదవశాత్తు ఢీకొట్టడంతో డివైడర్‌పై పడడంతో అతడి తలకు బలమైన గాయమైంది. గమనించిన స్థానికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు తరలించారు. ఈ మేరకు అవుటుపోస్టు పోలీసులు వివరాలను నమోదు చేశారు.